క్లుప్తంగా

ఇంటి వద్దకే వైద్య సేవలు



వైద్యపరీక్షలు చేస్తున్న డాక్టర్ పూర్ణలత

ఐరాల: ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో ఇంటి వద్దనే మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నామని స్థానిక పీహెచ్‌సీ డాక్టర్ పూర్ణలత అన్నారు. మండలంలోని నెల్లిమందపల్లెలో గురువారం ఫ్యామిలీ డాక్టర్ నిర్వహించారు. 104 వాహనంలో డాక్టర్ 70 మందికి వైద్యపరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గర్భిణులు, బాలింతలు, చిన్నపిల్లలు, వృద్ధులు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు నిర్వహించారు. ఇళ్లకే పరిమితమైన రోగుల వద్దకే వెళ్లి ఆరోగ్య పరిస్థితులు తెలుసుకుని సూచనలు, సలహాలు ఇచ్చారు. హెల్త్ అసిస్టెంట్ సుధాకర్, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

డయల్ యువర్ ఎమ్మెల్యేకు పలు ఫిర్యాదులు



సమస్యలు ఆరా తీస్తున్న ఎమ్మెల్యే గురజాల

చిత్తూరు అర్బన్: చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో గురువారం డయల్ యువర్ ఎమ్మెల్యే కార్యక్రమాన్ని నిర్వహించారు. మేయర్ అముదతో కలసి స్థానిక ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్‌నాయుడు ప్రజల నుంచి ఫోన్ ద్వారా ఫిర్యాదులు స్వీకరించారు. మొత్తం 48 ఫిర్యాదులు అందాయి. గతవారం వచ్చిన ఫిర్యాదుల్లో 23 సమస్యలు పరిష్కరించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. రానున్న వినాయకచవితి రోజున అందరూ మట్టి ప్రతిమలే పూజించాలని జగన్‌మోహన్ కోరారు. తనవంతుగా నియోజకవర్గంలో 25 వేల మట్టి వినాయక ప్రతిమలు ఉచితంగా పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రాజేష్‌కుమార్‌రెడ్డి, కమిషనర్ అరుణ పాల్గొన్నారు.

సీనియర్ పాత్రికేయుడు మృతి



వరప్రసాద్(ఫైల్)

బంగారుపాళెం: మండలంలోని తగ్గువారిపల్లెకు చెందిన సీనియర్ పాత్రికేయుడు గుండ్లపల్లె వరప్రసాద్ బుధవారం రాత్రి గుండెపోటుతో మృతిచెందాడు. గురువారం ఆయన భౌతికకాయాన్ని పలువురు పాత్రికేయులు, ప్రజాప్రతినిధులు సందర్శించి నివాళులర్పించి సంతాపం వ్యక్తం చేశారు. కుటుంబసభ్యులను ఓదార్చి సానుభూతి వ్యక్తం చేశారు. వరప్రసాద్ పలు దిన పత్రికల్లో పనిచేశారని, ప్రజాసమస్యల పరిష్కారానికి పాత్రికేయుడుగా తన వంతు కృషిచేశారని గుర్తుచేశారు.

నేడు సర్వసభ్య సమావేశం

పూతలపట్టు: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం ఉదయం 10.30గంటలకు సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ ప్రసన్నకుమారి ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలోని ఎంపీటీసీలు, వివిధ శాఖల అధికారులు హాజరు కావాలని కోరారు.

సకాలంలో వైద్యసేవలు అందిస్తున్నాం



తుమ్మిందపాళ్యంలో వైద్యసేవలు

గుడిపాల: ప్రతి గ్రామంలో సకాలంలో వైద్యసేవలు అందిస్తున్నామని డాక్టర్ చంద్రమహేష్ అన్నారు. గురువారం తుమ్మిందపాళ్యం గ్రామంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామంలోనూ వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. హెల్త్ క్లినిక్‌ల ద్వారా మంచం పట్టిన రోగుల ఇంటి వద్దకే వెళ్లి వైద్యం చేశామని తెలిపారు. అనంతరం గర్భిణులు, షుగర్ పేషెంట్‌లకు వైద్య చికిత్సలు చేసి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. వైద్యసిబ్బంది రాజేశ్వరి, చంద్రశేఖర్, రాధిక పాల్గొన్నారు.

సేంద్రియ ఎరువులతోనే అధిక దిగుబడి



సేంద్రియ ఎరువులతో సాగు చేసిన పంటను పరిశీలిస్తున్న డీపీఎం వాసు

పాలసముద్రం: ప్రకృతి సేద్యంలో రైతులు సేంద్రియ ఎరువులు వాడడంతోనే అధిక దిగుబడులు సాధించవచ్చునని డీపీఎం వాసు తెలిపారు. గురువారం క్రిష్ణమ్మపురంలో రైతులు ప్రకృతి వ్యవసాయంలో సేంద్రియ ఎరువులతో సాగు చేసిన పంటలను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రైతులతో డీపీఎం వాసు మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంలో సాగు చేసిన వరి నుంచి వచ్చిన బియ్యం ఉపయోగించుకుంటే సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. కిచెన్ గార్డెన్, సూర్య మండలం మోడల్ విత్తనాలపై రైతులకు అవగాహన కల్పించారు. కోఆర్డినేటర్ పుష్ప, రైతులు షణ్ముగరెడ్డి, ప్రకృతి వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లా ప్రభుత్వాస్పత్రిలోని అత్యవసర విభాగంలో చికిత్స పొందుతున్న బాధితులు



సార్.. ఫీవర్..!

చిత్తూరుకు చెందిన ప్రమీలమ్మ మూడు రోజులుగా తీవ్ర జ్వరంతో బాధపడుతోంది. దగ్గరలో ఉన్న ఓ ప్రైవేటు ఆస్పత్రికి వెళ్తే అక్కడ డాక్టర్లు ఆరోగ్య పరీక్షలు చేసి అధిక జ్వరం ఉందని, అడ్మిట్ అవ్వాలని సూచించారు. రెండు రోజుల పాటు పర్యవేక్షణలో ఉంచారు. కాస్త జ్వరం కుదుట పడడంతో డిశ్చార్జ్ చేశారు. అయితే కీళ్ల నొప్పులు అలానే ఉండడంతో ఇంట్లో విశ్రాంతి తీసుకోవాలని సూచించారు. ఇందుకు రూ.3,500 ఖర్చయింది.

అలాగే చిత్తూరు నగరానికి చెందిన కుమారి నాలుగు రోజుల క్రితం తీవ్ర జ్వరంతో చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లింది. అక్కడ పరీక్షించిన వైద్యులు ఆమెకు 102 డిగ్రీల జ్వరం ఉన్నట్లు నిర్ధారించారు. పీసీటీ 1 జీఎం ఇన్‌ఫ్యూజన్ బయటకు రాయించారు. తీసుకొచ్చాక అడ్మిట్ చేసుకుని వైద్య పరీక్షలు చేశారు. ఆ పరీక్ష ఫలితాలు కూడా తప్పులతడకగా ఇచ్చారు. ఈ విషయం డాక్టర్ కంట పడడంతో ల్యాబ్ సిబ్బందిపై ప్రశ్నల వర్షం కురిపించారు. కాస్త జ్వరం కుదుట పడడంతో ఆస్పత్రి నుంచి ఇంటికి చేరుకుంది.

- ఉమ్మడి జిల్లాలో సీజనల్ వ్యాధుల విజృంభన
- వణికిస్తున్న విషజ్వరాలు
- పెరుగుతున్న డెంగీ కేసులు
- ఆస్పత్రులకు క్యూకడుతున్న జ్వర పీడితులు
- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రోజూ 400 నుంచి 500 వరకు ఓపీలు
- ప్రభుత్వాస్పత్రులను వేధిస్తున్న మందుల కొరత
- అప్రమత్తంగా ఉండాలని వైద్యశాఖ హెచ్చరిక

కాణిపాకం: ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయి. ఏ ఆస్పత్రికి వెళ్లినా జ్వర పీడితులే కనిపిస్తున్నారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు అంతటా పారిశుద్ధ్య సమస్య ఉత్పన్నమవుతోంది. తద్వారా దోమల వ్యాప్తి పెరగడంతో వైరల్ ఫీవర్ల బారిన పడే వారి సంఖ్య భారీగా పెరుగుతోంది. కాగా వైద్య, ఆరోగ్యశాఖ ముందస్తు ప్రణాళికతో ముందుకు వెళ్తూ వ్యాధుల కట్టడికి చర్యలు తీసుకున్నా పారిశుధ్య సమస్య కారణంగా ఫలితం లేకుండాపోతోంది. దీంతో జిల్లా ఆస్పత్రులతో పాటు ప్రైవేట్ ఆస్పత్రులకు, పీహెచ్‌సీలకు జ్వరపీడితుల తాకిడి పెరిగింది.

వేధిస్తున్న మందుల కొరత..

ఉమ్మడి జిల్లాలో రెండు జిల్లా ఆస్పత్రులతో పాటు 10 ఏరియా ఆస్పత్రులు, 34 సీహెచ్‌సీలు, 108 పీహెచ్‌సీలు ఉన్నాయి. వీటన్నింట్లో కలిపి ఇప్పటివరకు 230 పైగా డెంగీ కేసులు నమోదయ్యాయి. అయితే ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లే వారి సంఖ్య తెలిస్తే ఈ సంఖ్య మరింత ఎక్కువగా ఉండొచ్చు. మరోవైపు విషజ్వరాలు విజృంభిస్తున్నాయి. జ్వరపీడితులు ఆస్పత్రులకు క్యూకడుతున్నారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా రోజుకు 400 నుంచి 500పైగా ఓపీలు నమోదు అవుతున్నాయి. అలాగే ప్రైవేటు ఆస్పత్రులు సైతం కిటకిటలాడుతున్నాయి. ప్రధానంగా ప్రభుత్వ ఆస్పత్రుల్లో జ్వరాలకు మందుల కొరత వేధిస్తోంది. నిల్వ లేకపోవడంతో మందులను బయట తీసుకోవాలని చీటీ రాసి పంపుతున్నారు. దీంతో రూ.500 నుంచి రూ.1000 వరకు ఖర్చవుతోంది. ఇక ప్రైవేటు ఆస్పత్రుల్లో పరీక్షల పేరుతో భారీగా ఫీజులు లాగేస్తున్నారు. జ్వరమని ప్రైవేటు ఆస్పత్రికి వెళ్తే రూ.2 వేల వరకు ఖర్చవుతోందని పలువురు వాపోతున్నారు.

ఈ ప్రాంతాల్లోనే అధికం..

జిల్లా వ్యాప్తంగా కురుస్తున్న వర్షాలకు దోమల వ్యాప్తి పెరిగి సీజనల్ వ్యాధులకు ఆజ్యం పోస్తున్నాయి. అతిసారంతో పాటు విషజ్వరాలకు కారణమవుతున్నాయి. డెంగీ విజృంభిస్తోంది. మురుగునీరు ప్రవహించడానికి సరైన కాలువలు లేకపోవడం, నీటి కుంటలు, గ్రామాల్లో ఇళ్ల మధ్యే మురుగునీళ్లు నిలిచిపోతుండడం కూడా ఇందుకు ప్రధాన కారణం. ముఖ్యంగా చిత్తూరు, గుడిపాల, జీడీనెల్లూరు, ఎస్ఆర్‌పురం, కార్వేటినగరం, పలమనేరు, వి.కోట, పుంగనూరు, కుప్పం, గుడుపల్లె, శాంతిపురం, వడమాలపేట, తిరుపతి అర్బన్, రేణిగుంట, సత్యవేడు ప్రాంతాల్లో జ్వర పీడితుల సంఖ్య రోజురోజుకు ఎక్కువగా పెరుగుతోంది.

అప్రమత్తతే ఆయుధం..

ప్రజలు అప్రమత్తంగా ఉండకపోతే సీజనల్ వ్యాధులు మరింత విజృంభించే ప్రమాదం ఉందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ప్రధానంగా జిల్లాలో ఏటా డెంగీ కేసుల తీవ్రత ఎక్కువగా ఉంటోంది. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల శుభ్రత పాటించాలని, ఎక్కడా నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని సూచిస్తున్నారు. జ్వరం లక్షణాలు ఉంటే వెంటనే ప్రభుత్వ ఆస్పత్రులకు వెళ్లి పరీక్షలు చేయించుకోవాలని చెబుతున్నారు.

వదలకుండా వస్తోంది..



ఇంట్లో ఒకరి నుంచి మరొకరి జ్వరం సోకుతోంది. వారం రోజులైనా వదలడం లేదు. ఆపై కీళ్ల నొప్పులు వేధిస్తున్నాయి. మా ఇంట్లో ఇద్దరికి జ్వరం వస్తే ప్రైవేటు ఆస్పత్రికి వెళ్లి చూపించుకున్నాం. వారి ఇచ్చిన మాత్రలు వేసుకుని, సిరప్ తాగితే కుదుటపడింది. ఫీజులు ఎక్కువగా ఉన్నాయి. సీజనల్ వ్యాధులు రాకుండా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి.

– ఆనంద్, తిరుపతి

సమన్వయలోపం.. ప్రజలకు శాపం..

పట్టణాలతో పోలిస్తే గ్రామీణ ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులు సరిగా జరగడం లేదు. పారిశుద్ధ్య నిర్వహణ మొత్తం పంచాయతీ శాఖ చూస్తున్నా.. పనులు ఆశించిన స్థాయిలో ఉండడం లేదు. సీజనల్ జ్వరాలు వ్యాపిస్తున్నా పంచాయతీశాఖ అధికారులు మేల్కొనడం లేదు. గ్రామాల్లో నీటి నిల్వ కేంద్రాలు, ఓవర్‌హెడ్ ట్యాంకులను నెలలో రెండుసార్లు వీటిని శుభ్రం చేయాలనే నిబంధనలు ఉన్నా పట్టించుకునే దిక్కులేదు. ముందస్తుగా ప్రజలను చైతన్యం చేసి సీజనల్ వ్యాధుల బారిన పడకుండా కాపాడాల్సిన అధికారులు జ్వరాలు విజృంభించిన తరువాత కంటి తుడుపు చర్యగా వైద్యశిబిరాలు పెడుతున్నారు. పంచాయతీ, ఆర్‌డబ్ల్యూఎస్, వైద్యశాఖల మధ్య సమన్వయలోపం కొరవడింది. దీనికితోడు సర్పంచులు, పంచాయతీ కార్యదర్శుల మధ్య సమన్వయలోపం ప్రజలకు శాపంగా మారింది.

వ్యాధుల కట్టడికి కార్యాచరణ...



జిల్లాలో సీజనల్ వ్యాధుల వ్యాప్తిని అరికట్టడానికి పీహెచ్‌సీల పరిధిలో అధికారులను అప్రమత్తం చేశాం. అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో సీజనల్ వ్యాధుల చికిత్స కోసం ప్రత్యేక వార్డులను సిద్ధం చేశాం. దోమలు వృద్ధి చెందకుండా డ్రైనేజీల్లో వేయడానికి గంబూషియా చేపలు వదులుతున్నాం. రహదారులపై నీరు నిల్వకుండా చర్యలు చేపట్టాలని పంచాయతీ అధికారులను కోరాం. ప్రజలు సైతం అప్రమత్తంగా ఉండాలి.

– శ్రీహరి, డీఎంఅండ్‌హెచ్‌ఓ, తిరుపతి

నిర్లక్ష్యం చేస్తే ఊరుకోం..



గ్రామాల్లో సీజనల్ వ్యాధులు వ్యాపిస్తే తక్షణం స్పందించాలని మండల వైద్యాధికారులకు ఆదేశించాం. ఎక్కడైనా గ్రామాల్లో అధికారులు స్పందించకుంటే చెప్పండి. వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. సీజనల్ ప్రభావంతోనే విషజ్వరాలు ప్రబలుతున్నాయి. ఈ విషయంలో నిర్లక్ష్యం వద్దు. జ్వరం వల్ల శరీరం నీరసించి, గుండెనొప్పి, కాళ్లు, చేతులు లాగడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. వెంటనే డాక్టర్లను సంప్రదించాలి.

– ప్రభావతిదేవి, డీఎంఅండ్‌హెచ్‌ఓ, చిత్తూరు

జిల్లాలో శాంతి భద్రతలు పరిరక్షించాలి

- రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలతో సమావేశం ఏర్పాటు చేయాలి
- సీపీఐ రామానాయుడు, నాగరాజు, జనార్దన్ విజ్ఞప్తి

చిత్తూరు కార్పొరేషన్: ఉమ్మడి జిల్లాలో శాంతిభద్రతలను పరిరక్షించాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రామానాయుడు, జిల్లా కార్యదర్శి నాగరాజు, జిల్లా సహాయ కార్యదర్శి జనార్దన్ ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. పుంగనూరులో జరిగిన దాడి సంఘటన దృష్ట్యా జిల్లాలో శాంతి భద్రతలకు విఘాతం కలిగే ప్రమాదం ఉందన్నారు. దీనిపై జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు జోక్యం చేసుకోవాలన్నారు. రాజకీయపార్టీలు, ప్రజాసంఘాలతో సమావేశం ఏర్పాటు చేసి శాంతిభద్రతల పరిరక్షించడానికి చొరవ చూపాలన్నారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

యువకుడి అదృశ్యం



శివకుమార్ (ఫైల్)

పలమనేరు: పట్టణంలోని రాధాబంగ్లాకు చెందిన శివ కుమార్(30) గత మూడు రోజులుగా కనిపించడం లేదని కుటుంబసభ్యులు స్థానిక పోలీసులకు గురువారం ఫిర్యాదు చేశారు. ఇతను పట్టణంలోని ఓ మెడికల్ షాపులో పనిచేసేవాడని తెలిపారు. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

పెండింగ్‌లో ఉన్న జీతాలు చెల్లించాలి

నగరి: గ్రామ పంచాయతీల్లో పనిచేసే గ్రీన్ అంబాసిడర్ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న జీతాలు ఇప్పించాలని గ్రీన్ అంబాసిడర్ వర్కర్స్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు రాజేంద్రన్ డిమాండ్ చేశారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద జీతాలు చెల్లించాలని కోరుతూ నిరసన వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ పంచాయతీ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న జీతాలు ఇవ్వాలని కోరుతూ జిల్లా అధికార యంత్రాంగం దృష్టికి తీసుకెళ్లినా స్పందించడం లేదన్నారు. నూతన కలెక్టర్ దృష్టికి సమస్యను తీసుకెళ్లిన సమయంలో జీతాలు వేస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. అయితే సంబంధిత అధికారులు ఇప్పటివరకు నెల జీతం కూడా వేయలేదన్నారు. అధికారులు స్పందించి జీతాలు చెల్లించాలని ఎంపీడీఓకు వినతిపత్రం అందించారు.

ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ ప్రాణరక్ష

- పలమనేరులో న్యాయవాదుల అవగాహన బైక్ ర్యాలీ
- హెల్మెట్ ధరించాలంటూ సూచన



ర్యాలీ నిర్వహిస్తున్న న్యాయవాదులు

పలమనేరు: ద్విచక్రవాహనదారులకు హెల్మెట్ ప్రాణరక్ష అని స్థానిక సీనియర్ సివిల్ జడ్జి శ్రీనివాసరావు సూచించారు. ఆయన ఆదేశాల మేరకు ద్విచక్ర వాహనదారులు విధిగా హెల్మెట్లను ధరించాలని ప్రజలకు అవగాన కల్పిస్తూ స్థానిక న్యాయవాదులు గురువారం పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల నుంచి పట్టణ వీధుల్లో బైక్ ర్యాలీని నిర్వహించారు. కార్యక్రమాన్ని ప్రారంభించి ఆయన మాట్లాడుతూ ఈ మధ్య కాలంలో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో పలువురు మృతికి తలకు దెబ్బతగలడమే కారణమైందన్నారు. హెల్మెంట్ ధరించి ఉంటే వారు ప్రాణాలతో ఉండేవారన్నారు.

మనం ఎంత జాగ్రత్తగా ఉన్నా ఎదురుగా వచ్చే వాళ్ల నిర్లక్ష్యం ఒక్కోసారి మన ప్రాణాలపైకి వస్తుందన్నారు. సురక్షితంగా ఉండాలంటే బైక్‌లు నడిపే ప్రతిఒక్కరూ తప్పకుండా హెల్మెట్లు ధరించాలని సూచించారు. అనంతరం పలువురు న్యాయవాదులు మాట్లాడుతూ పట్టణంలో మైనర్ల నుంచి యూత్ దాకా వేగంగా బైక్‌లను నడుపుతున్నారన్నారు. ముఖ్యంగా బైక్ రేస్‌లు ఇక్కడ సాగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. 18 ఏళ్లు నిండకుండా బైక్‌లు నడిపేవారి నిర్లక్ష్యానికి వారి తల్లిదండ్రులు తప్పకుండా బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. ఇకపై మద్యం తాగి వాహనాలను నడిపే వారికి రూ.10వేల జరిమానా ఉంటుందని తెలిపారు. ర్యాలీలో న్యాయవాదులు పరమశివప్ప, లక్ష్మీపతి, భర్కర్, షరీఫ్, ఏజీపీ క్రిష్ణమూర్తి, ఇస్మాయిల్ పాల్గొన్నారు.

పకడ్బందీగా కుష్ఠు వ్యాధి సర్వే



బంగారుపాళెం: పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వైద్యసిబ్బంది

బంగారుపాళెం: కుష్ఠు వ్యాధి సర్వేను మండలంలో పకడ్బందీగా నిర్వహించాలని తుంబకుప్పం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ లోహిత్ చెంగల్‌రాయన్ అన్నారు. స్థానిక ఎంపీడీఓ సమావేశ భవనంలో గురువారం కుష్ఠువ్యాధి సర్వేపై ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ఈనెల 18వ తేదీ నుంచి ఆగస్టు 2వ తేదీ వరకు గ్రామాల్లో సిబ్బంది ఇంటింటికీ వెళ్లి సర్వే చేయాలని సూచించారు. అనంతరం కుష్ఠువ్యాధి నివారణ పోస్టర్లను ఆవిష్కరించారు. డాక్టర్ లోకేష్, ఎంపీహెచ్ఈఓ రమేష్, హెల్త్‌సూపర్‌వైజర్లు అముద, హరికృష్ణ, ఎంఎల్‌హెచ్‌పీ పునీత్ పాల్గొన్నారు.

సకాలంలో గుర్తిస్తే నయం చేయొచ్చు



ఐరాల: మాట్లాడుతున్న డాక్టర్ ప్రవీణ్‌కుమార్

ఐరాల: కుష్ఠు వ్యాధిని సకాలంలో గుర్తించి వైద్యం తీసుకుంటే వందశాతం నయం చేయొచ్చని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ అన్నారు. గురువారం పీహెచ్‌సీలో ఆయన ఏంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లతో కుష్ఠువ్యాధిపై సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నేటి నుంచి ఆగస్టు 2 వరకు కుష్ఠు వ్యాధిగ్రస్తులను గుర్తించే కార్యక్రమం ప్రణాళికబద్ధంగా నిర్వహించాలని సూచించారు. పీహెచ్‌సీ పరిధిలోని గ్రామాల్లో కుష్ఠు వ్యాధిపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. కుష్ఠు వ్యాధి నిర్మూలించే రోగమన్నారు. ఎవరికైనా శరీరంపై స్పర్శలేని ఎరుపురంగు మచ్చలు కన్పించినట్లయితే సమీపంలోని ఆరోగ్యకేంద్రంలో చూపించాలన్నారు. కుష్ఠు వ్యాధిగ్రస్తులను తొలిదశలోనే గుర్తించి వైద్యం పొందినట్లయితే అంగవైకల్యం రాకుండా కాపాడుకోవచ్చని వెల్లడించారు. పీహెచ్ఎన్ జీవకళ, ఎల్‌డీసీ ఉమాపతి పాల్గొన్నారు.



గుడిపాల: కుష్ఠు వ్యాధిగ్రస్తులను పరిశీలిస్తున్న డాక్టర్ చంద్రమహేష్

కుష్ఠు వ్యాధి నిర్మూలనే ధ్యేయం

గుడిపాల: కుష్ఠు వ్యాధి నిర్మూలనే ధ్యేయంగా పని చేయాలని గుడిపాల ప్రాథమిక వైద్యాధికారి చంద్రమహేష్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో కుష్ఠు వ్యాధిగ్రస్తుల్ని గుర్తించే కార్యక్రమం నిర్వహించారు. వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రైవేట్‌లో తప్పని బండెడు మోత!

- బలహీనమవుతున్న చిన్నారుల వెన్నుముక
- భవిష్యత్తులో ఆరోగ్య సమస్యలు తప్పవా?
- ఆవేదన చెందుతున్న తల్లిదండ్రులు



చిన్నారుల పుస్తకాల మోత

పలమనేరు: ఏం కార్పొరేట్ చదువులోగానీ చిన్నారులకు మాత్రం బండెడు పుస్తకాల మోత తప్పడం లేదు. ఆడుతూ, పాడుతూ ఉండాల్సిన వయస్సులో పిల్లలకు బ్యాగుల భారం శరాఘాతంలా మారింది. చిన్నారుల బరువులో పది శాతానికి మించి బరువు మోయరాదనే నిపుణుల మాటలను అటు పాఠశాలల యాజమాన్యాలు, ఇటు తల్లిదండ్రులు అసలు పట్టించుకోవడం లేదు. ధనార్జన కోసం లేనిపోని పుస్తకాలను కొని చేలా చేసి పిల్లల జీవితాలతో చెలగాటమాడుతున్నాయి.

దీంతో పిల్లల భవిష్యత్తు చాలా ప్రమాదకరంగా మారుతున్నప్పటికీ అనర్థాలపై అవగాహన లేని తల్లిదండ్రులు ఈ విషయంపై నోరు మెదపకపోవడం బాధాకరం. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో మూడేళ్ల నుంచి 15 ఏళ్ల వరకు 5 లక్షల మంది దాకా విద్యార్థులున్నారు. వీరిలో ప్రైవేట్ పాఠశాలలకు వెళ్లేవారు రెండు లక్షల మంది దాకా ఉన్నారు. వీరికి పుస్తకాల మోత తప్పడం లేదు.

రెండేళ్లకే బడికి పంపేస్తున్నారు.....

ఇక తల్లిదండ్రులు సైతం చిన్నారులను రెండేళ్లకే బడికి పంపేస్తున్నారు. గతంలో పిల్లాడికి ఐదేళ్లు దాటితేనే బడికి పంపేవారు. ఇప్పుడు అలా కాదు ప్రీ ప్రైమరీ, నర్సరీ, ప్లే స్కూల్ పేరిట పిల్లలను పంపడం ఓ ఫ్యాషన్‌లా మారింది. అసలే శారీరక సామర్థ్యం లేని పసిమొగ్గలు పుస్తకాల భారం మోయలేక వెన్నుముఖనొప్పితోనే వెళ్లాల్సి వస్తోంది. మారుతున్న ఆహారపు అలవాట్ల కారణంగా పౌష్టికాహారలోపంతో పిల్లలు బలహీనంగా ఉన్నారు. ఎముకల్లో కాల్షియం తక్కువగా ఉన్న వీరు పెద్దవాళ్లు అయ్యాక కూడా ఇబ్బందులు తప్పవని వైద్యులు చెబుతున్నారు.

బ్యాగులో 30 దాకా పుస్తకాలు...

గతంలో తరగతిని బట్టి ఐదు సబ్జెక్టులకు కేవలం ఐదు పాఠ్యపుస్తకాలు, అందుకు ఐదు చిన్న నోట్‌బుక్స్ మాత్రమే ఉండేవి. ఇప్పుడు అచ్చు పుస్తకాలు, వాటికి ఉపవాచకాలు, రైటింగ్ బుక్కులు, డ్రాయింగ్, కాపీ రైటింగ్, ఫజిల్స్, అనుబంధ పుస్తకాలు పేరిట పుస్తకాల ముద్రణాలయాల కమిషన్‌కు, వారి యాజమాన్యాలు ఓ విద్యార్థికి 20 నుంచి 30 పుస్తకాలను కట్టబెడుతోంది. దీంతోపాటు లంచ్ బ్యాగు, ఇంటి నుంచి మంచినీళ్ల బాటిల్ మోత ఉండాల్సిందే.

యశ్‌పాల్ కమిటీ ఆదేశాలు గాలికి..



చిన్నారుల పుస్తకాల మోతపై గతంలో అధ్యయనం చేసిన యశ్‌పాల్ కమిటీ కొన్ని సూచనలు చేసింది. విద్యార్థులకు గుణాత్మక విద్యనందిస్తూ వారి వయస్సుకు మించి పుస్తకాలను మోయించరాదు.1 నుంచి 5 తరగతులకు మూడు కిలోలకు మించి బరువు మోయించరాదు. పదో తరగతికి ఐదు కిలోల వరకే బరువు ఉండాలి. కానీ ఈ ఆదేశాలను ప్రభుత్వం పటిష్టంగా అమలు చేయకపోగా ప్రైవేట్ యాజమాన్యాలు అసలు ఖాతరు చేయడం లేదు. అసలే నేటి పిల్లల్లో శారీరక దృఢత్వం తక్కువ, ప్రస్తుతం మనం తింటున్న ఆహారంలో సత్తువలేదు.

– డా. రజని, ఫిజియోథెరపిస్ట్

ఆరోగ్య సమస్యలు తప్పవు..



ఎదిగే వయస్సు పిల్లలకు వారి బరువుకంటే అధిక బరువులను మోయించడంతో ఆరోగ్య సమస్యలు తప్పవు. ఎముకలు, కీళ్లు, వెన్నుముక, కండరాల సమస్యలు రావచ్చు. అసలు 20 ఏళ్ల తర్వాత వచ్చే జబ్బులన్నీ పాఠశాల దశలోనే వస్తున్నాయి. దీనిపై ప్రైవేట్ యాజమాన్యాల్లో మార్పు రావాలి. దీనిపై తల్లిదండ్రులు ఆలోచించాలి.

– డా.మమతారాణి, చిన్నపిల్లల నిపుణులు, ఏరియా ఆస్పత్రి, పలమనేరు

విత్తనాలు సద్వినియోగం చేసుకోండి



పశుగ్రాస విత్తనాలు పంపిణీ చేస్తున్న అధికారులు

బంగారుపాళెం: రైతులు రాయితీ పశుగ్రాస విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలని బంగారుపాళెం ప్రాంతీయ పశువైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ షేక్ ఆసీఫ్ అన్నారు. గురువారం నలగాంపల్లె పశువైద్య కేంద్రం ఆవరణలో పాడి రైతులకు రాయితీ పశుగ్రాస విత్తనాలు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ రైతులకు పశుసంవర్ధకశాఖ ద్వారా 75 శాతం రాయితీపై మొక్కజొన్న, జొన్న విత్తనాలు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. మొక్కజొన్న రకం 5 కేజీలు రూ.85, జొన్న విత్తనాలు రూ.115కు అందిస్తున్నామని ఆయన తెలిపారు.

పశుగ్రాస విత్తనాలు అవసరమైన రైతులు తమ ఆధార్ కార్డు, భూమి పాస్‌బుక్ జిరాక్సు కాపీలు తీసుకొచ్చి రాయితీ విత్తనాలు కొనుగోలు చేసుకోవచ్చని సూచించారు. సర్పంచ్ షీబా, ఎంపీటీసీ ప్రసన్నకుమారి, నలగాంపల్లె పశువైద్యశాల డాక్టర్ జాన్సీ, రైతులు పాల్గొన్నారు.